# దేవుడా! మేం ప్రయాణీకులం



కె. లలితాచలం

రేవులో అన్ని పడవలూ వెళ్లిపోయాయి, ఒక్క పాపయ్య పడవ తప్ప. పాపయ్య ఎప్పుడూ చివరగానే బయలుదేరతాడు. అందరితోపాటు చేరుకుంటాడు.

సంవత్సరమంతా ఆ రేవు సందడి ఒక ఎత్తు ఆ రోజు ఒక ఎత్తు. పడవలన్నీ అలంకరించుకుని సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని కళ్ళారా చూడాలని, చూచి తరించాలనీ తండోపతండాలుగా భద్రాద్రికి తరలి వెళ్లే భక్తుల్ని తమ ఒడిలో కూచోబెట్టుకుని, ఆనందడోలికల్లో ఊగులాడుతూ, గంగమ్మతో ఊసులాడుకుంటూ తరలే రోజది.

అందరి మనసులో ఒకే ఊహ. అందరి కన్నుల్లో ఒకే దృశ్యం. అదే ఆ దివ్య మంగళ స్వరూపుడు, సీతా సమేతుడైన ఆ శ్రీరామచంద్రుని కమనీయ రూపం. కన్నుల ముందు లీలా మాత్రంగా, ఊహాతీతంగా, అందరి ముందూ దర్శన మిస్తోంది. అందరి మనసుల్లో ఆతృత. ఎప్పుడెప్పుడు, ఆ పుణ్యస్థలిలో అడుగు పెడతామా! ఎప్పుడెప్పుడు ఆస్వామిని దర్శిస్తామా అని.

దొరికిన పడవలో తనువుల్ని చేర్చి ఎలాగో ఒకలాగున ప్రయాణం సాగించి గమ్యం చేరుకోవాలన్న తపన ప్రతి ఒక్కరి కన్నుల్లో గోచరిస్తోంది.

ప్రయాణీకుల్ని నింపుకుని ఉత్సాహంతో పాటలు పాడుకుంటూ భజనలు చేసుకుంటూ హరికథా కాలక్షేపం చేస్తూ పడవలు ముందుకు సాగిపోయాయి.

పాపయ్య పొద్దుటినుంచీ పడవని అలంక

రిస్తున్నాడు. పాపయ్య భార్య రంగి పడవకు పసుపు పూసి, కుంకం బొట్లుపెట్టింది. గూడు ముంగిట మామిడి తోరణాలు, పూవులు కట్టాడు పాపయ్య. తెరచాప కొయ్యకు బొట్లుపెట్టి అలంకరించాడు. పడవ అందాలు సంతరించుకుని సిగ్గులు మొగ్గలైపోతున్న సీతమ్మవారి లాగా కనిపించింది పాపయ్య కళ్ళకు.

జాము పొద్దెక్కేసరికి పాపయ్య అందాల హంసతోపాటు రంగికూడా ముస్తాబైంది. కళ్ళనిండా కాటుక దిద్దింది. అర్ధరూపాయంత ఎర్ర కుంకుమ బొట్టు పెట్టింది. కొప్పులో ఎర్ర గన్నేర్లు తురిమింది, చిగురంచు చుక్కలచీర, చిలక పచ్చని రెవిక తొడిగింది, చిలకల్లే నవ్వింది. మెడలో ఏ ఆభరణాలు లేకపోయినా ఆ చిలక నవ్వే ఏడువారాల నగలుగా అనిపించింది పాపయ్యకు. తన అందాల పడవ హంసనీ, రామచిలకలా కిలకిల నవ్వే రంగినీ మార్చి మార్చి చూసుకున్నాడు. తృప్తిగా నవ్వుకున్నాడు. రాములవారి కోసం ఎదురు చూసి చూసి కళ్ల కాయలు కాసిన గుహుడి లాగా ప్రయాణీకుల రాకకోసం ఎదురుచూశాడు. పాపయ్య ఎప్పుడెప్పుడు ఆ భక్తుల్ని భద్రాద్రి చేర్చి వారితోపాటు తనుకూడా శ్రీరామదర్శనం చేసుకుంటానా అని తహతహలాడిపోతున్నాడు.


దూరంగా ప్రయాణీకుల అలజడి అవుతోంది. రంగిమీద నిలిచిన చూపు మరొక పక్కకు తొలగటంలేదు. తను రాములారిలా రంగి సీతమ్మోరిలా, హంస గుహుడి పడవలా ఊహించుకుని పొంగి పోతున్నాడు పాపయ్య. మైమరచి పోతున్నాడు. 'మావా అంసనీ నన్నూ పొద్దు కుంకిందాకా సూత్తా కూకో, మనం భద్రాద్రి ఎల్లినట్టే సామిని సూసినట్టే. నెగు నెగు, అంటూ భర్తను తొందర చేసింది రంగి. పడవెక్కి నిక్కినిక్కి చూసింది ప్రయాణీకుల రాకకోసం.

తళతళలాడే ఇత్తడి సామాన్ల గంపతో కామయ్యవచ్చాడు. అంగట్లో కామయ్య సామాన్లకో ప్రత్యేకత ఉంది. కామయ్యని ఆప్యాయతగా పలకరించి యోగక్షేమాలు విచారించాడు పాపయ్య. రంగి సామాన్లన్నీ ఒక పక్కగా సర్దుకోమని చోటు చూపించింది. రంగు రంగుల లక్కపిడతలు, చెక్కబొమ్మలు రకరకాల బొమ్మల సామాన్లతో యాకూబు ఆయాసపడుతూ వచ్చాడు. యాకూబు వెనకాల కుటుంబయ్య కూజాలు కుండలు చట్లు తీసుకొచ్చి పడవలో సర్దుకుని చెమట తుడుచుకున్నాడు. ఒకరి నొకరు పలకరించుకున్నారు. పిచ్చాపాటీ మాట్లాడుకోసాగారు. సాలె సాంబయ్యకూడా వారి మాటల్లో మాటలు కలిపాడు మూట దింపుతూ. తనకు తోడుగా ఆడపిల్లలు ఎవరైనా వస్తే, ఎంచక్కా ఊసులాడుకోవచ్చుననుకుంది రంగి. దూరంగా వచ్చే అమ్మాయిల్ని చూసి ముఖం చేటంత చేసుకుంది, త్వరగా రమ్మని చెయ్యూపింది, "ఓరే రంగీ! ఆ సిన్నది?" అన్నాడు పాపయ్య ఆ పిల్లల వంక తేరిపార చూస్తూ. "ఇదుగో! ఓర సూపు కోరసూపు వయసొచ్చిన పిల్నిచూసినావంటె కల్లు పీకేత్త, ఏటనుకున్నావో! బుద్ది గుంటె మంచిది" అంది పాపయ్య గుణం తెలిసినా. తనను తప్ప ఎవరి ఊసెత్తినా రంగికి చిరాకు. అది అసూయ. ఆడగుణం!

'ఓసోసి ఓరని అడిగితేనే కసుబుసులాడతన్నావు. ఓరసూపు సూత్తే ఉరేసుకుంటా నంటవని నాకెరికేనే అమ్మీ! కుసింత సెయ్యి ఆసరా ఇద్దునా? కాలు జారుద్దేమో!" కొంటెగా చూశాడు పాపయ్య. "అల్ల కాలు జారకుండ నే సూత్తాలే, నీ మనసు జారకుండ సూసుకో" అంటూ పైట సద్దుకుని, బుడబుక్కల భాగ్య చేతిలో మూట అందుకుని చేయి అందిచ్చింది. భాగ్యమ్మ లచ్మి చేతులో చెప్పుల మూట అందుకుని తన చెయ్యిని అందిచ్చింది.

"ఏమే! భాగ్యా మీ అయ్య, మొన్ననే ఎల్లిండు గదా! నువు ఇయాలదాకా అగినావెందుకే?" పలకరింపుగా అంది రంగి.

"మా అయ్య,నన్నూ, లచ్మినీ కలిసి రమ్మన్నాడు. ఆడికి ఎదవ సచ్చినోల్లు పోకిరీ ఎదవలొచ్చి, ఎదవ కల్లెట్టుకు సూత్తరని, మా అయ్య పండక్కిరమ్మని సెప్పి ఎల్లీసినాడు" అంది




భాగ్య. ఔనన్నట్లుగా తలూపింది మాలచ్మి.

లచ్మి తన మూట కూడా ఒక పక్కన పెట్టుకుని బుద్ధిగా కూచుంది.

గూడు నిండా సామానుతో నిండిపోయింది. ప్రయాణీకులు మాత్రం గుడిశ బయట చెక్క మీదే కూర్చున్నారు. భాగ్య వెంటవచ్చిన కోతిపిల్ల మాత్రం కిచకిచమంటూ గూడుమీద అటూ ఇటూ తిరుగుతూ అల్లరిచేస్తోంది. పడవ ఎప్పుడు బయలు దేరుతుందా! అని అందరూ ఎదురు చూస్తున్నారు.

"రంగీ నా అంస కడుపు నిండింది. నా తల్లి ఒడి నిండి దిట్టితీసి టెంకాయకొట్టే. అంసని గోదారి తల్లి ఒడిలోకి తోసేత్తా. ఒడిలోపడ్డ బిడ్డని ఆ తల్లే ఎత్తుకుని ముద్దాడుద్ది." అంటూ ఉషారుగా రంగిని పిలిచాడు పాపయ్య.

రంగి గోదారి తల్లికి పసుపు, కుంకుమ, పూలువేసి పూజచేసింది. అందరూ భక్తితో ఆ తల్లికి దణ్ణాలు పెట్టుకున్నారు. డబ్బులు విసిరేశారు గోదావరిలోకి.

రంగి దేముణ్ణి తలచుకుని కొబ్బరికాయ కొట్టబోయింది. దూరాన్నుంచి ఎవరో "ఆగరా పాపయ్యా" అంటూ కేకలువేస్తూ వచ్చారు.

"సాములు సాములు" అన్నారు పడవలో వాళ్ళంతా ముక్తకంఠంతో. బ్రహ్మయ్యగారిని ఆ పల్లెవాసులందరూ సాములు అని పిలుస్తారు. ఆయన మహాపండితుడు. వేదవేదాంగాలు రంగరించి ఉద్ధరిణలోపోసి అవుపోసన పట్టిన మహాఘటికుడు. ఆయనంటే అందరికీ గౌరవం భక్తి, భయం. అందుకే పడవ ఆయనకోసం ఆగింది.

బ్రహ్మయ్యగారు సకుటుంబ సపరివార సమేతంగా విచ్చేశారు. వర్షం రాకుండా పడవ బయలుదేరాలని ఆయన ఆశ. అందుకే పరుగు పరుగున వచ్చారు. ఇంక కొన్ని నిమిషాల్లో వర్షం వస్తుంది. చకచకా సామాన్లు పడవలోకి ఎక్కించారు బ్రహ్మయ్యగారు. భార్యనీ పిల్లల్ని కూడ ఎక్కమని తొందర చేస్తున్నారు.

ఎంత భక్తిగౌరవాలున్నా పాపయ్య మనసు ఏదో పాపభీతితో నిండిపోయింది. బ్రహ్మయ్యగారు తన పడవలో ఎక్కడం పాపయ్యకు సుతరాం ఇష్టంగా అనిపించలేదు. మరొక పడవలో ఆయన వెళ్ళకూడదా! అనికూడా అనిపించింది. కాని పైకి ఏమీ అనలేక లోపల దాచుకోలేక సతమతమైపోతున్నాడు పాపయ్య.

బ్రహ్మయ్యగారు గూడులోకి తలదూర్చి గూడునిండా ఇత్తడి పాత్రలు కుండలు బట్టలు చూశారు. అన్నం మూటలు, చెప్పుల జోళ్ళతో నిండిపోయి ఉంది. చేపల కంపుకూడా కొడుతోంది ఒక పక్క. బ్రహ్మయ్యగారు ముక్కు మూసుకుని అయిష్టంగా వెనక్కి తిరిగారు. ఆ మనష్యుల మధ్య తనంతటివాడు కూర్చుని ప్రయాణం చెయ్యడమా అన్న అహంభావం

కూడా అడ్డొచ్చింది. పోనీ దిగిపోదామంటే అదే ఆఖరు పడవ. కొద్ది సేపట్లో వర్జం. ఆపైన అష్టమి గడియలు ప్రవేశిస్తాయి. అష్టమి నవ ములు కష్టదినాలు ప్రయాణానికి. ఈ రోజు బయలుదేరితే గానీ, శ్రీరామనవమి నాటికి భద్రాద్రి చేరడం కష్టం. శ్రీరాముని కళ్యాణానికి వెళ్ళి తీరాలి. అనేక శంకలు అడ్డుగోడలుగా నిలిచినా వాటిని కూలగొట్టి ప్రయాణం సాగించ డానికే నిశ్చయించుకున్నారు బ్రహ్మయ్యగారు. అంతగా అయితే భద్రాద్రి చేరగానే ప్రాయ శ్చిత్తం చేసుకోవచ్చునని సరిపుచ్చుకున్నారు. పుణ్యాహవచనం చెసుకుంటే సరి అనుకున్నారు మనసులో.

గూడులోకి కాలుపెట్టి జరగండి అన్నట్టుగా చేతితో సంజ్ఞ చేశారు. కొందరు బైటకువచ్చి కూచున్నారు. మరి కొందరు చివరగా ఒదిగి కూచున్నారు.

రంగి టెంకాయ కొట్టింది. పాపయ్య పడ వని గోదారి తల్లి ఒడిలోకి తోశాడు ఎత్తుకో మన్నట్లుగా. రంగి గంగమ్మ తల్లిని మనసారా ప్రార్థించింది. ఈ ప్రయాణం చల్లగా సాగాలని కొట్టిన కొబ్బరికాయ దిష్టితీసి గోదావరి లోకి విసిరేసింది రంగి.

'రామయ తండ్రీ! భద్రాద్రి వాసా! సేదకో తండ్రీ సేదుకోసామీ' అంటూ పాపయ్య గడ నీటిలోకి దింపాడు. అందరూ భక్తి శ్రద్ధలతో పాపయ్యతో శృతికలిపారు. పాపయ్య దృష్టి ఆ భద్రాద్రివాసుని పైనే లగ్నమైపోయింది.

పాపయ్య అమితోత్సాహంతో పల్లెపదాలు పాడుకుంటూ జోరుగా గడవేస్తున్నాడు. పడవ నీటివాలుని చీల్చుకుంటూ సాగిపోతోంది. పడవ పుంజుకుంటున్న వేగానికి అందరికీ ఉత్సాహం ఉరకలు వేస్తోంది. కొందరు భజనలు చేసు కుంటున్నారు. పాటలు వచ్చినవారు ఆ భద్రాద్రి వాసుడి ప్రియభక్తుడైన రామదాసు కీర్తనలు గానం చేస్తున్నారు. బ్రహ్మయ్యగారి మనసు దైవధ్యానంమీద కంటె తాను అపవిత్రమైన చోటులో కూర్చున్నానే అన్నబాధతో నిండి పోతోంది. ఒక పక్క చిరాకు ఒక పక్క ఏమీ చేయలేని అసమర్థత, తప్పనిసరి ఆయన నోటిని కట్టి పారేశాయి. 'చిత్తం శివుని పైన భక్తి చెప్పులపైన' అనే సామెత తీరున ఉంది బ్రహ్మయ్యగారి పని.

'నేనెంతపుణ్యాత్ముడినో ఆ స్వామిని కొలిచి తరించే భక్తులను, స్వామి దర్శనానికి తీసుకుని వెళ్ళే భాగ్యం నా హంసకు పట్టింది' అను కుంటూ ఎవరి దగ్గరా డబ్బు తీసుకోలేదు పాపయ్య. అతని ధ్యేయం ఆ పుణ్యాత్ము లందర్నీ రాముని దగ్గరకు తీసుకుని వెళ్ళడమే. అదే తనకు పుణ్యం, పురుషార్థంగా భావించాడు పాపయ్య. రంగి కూడా అతనికి తగిన ఇల్లాలు.

అంతలో ఆకాశమంతా మబ్బులు కమ్మే సింది. చిరుగాలి ఈదర గాలిగా తుంపరలు కుంభవృష్టిగా క్షణాల్లో ముంచుకు వచ్చేసింది. ముందు అగాధమే ఉందో, సుడిగుండాలే ఉన్నాయో కూడా కనుపించటంలేదు. వాన ఎడా పెడా కొట్టేస్తోంది. గోచీ తప్ప మరొక ఆచ్ఛాదనలేని పాపయ్య శరీరం గజగజా ఒణికి పోతోంది. కనుచూపు మేరలో అతనికి ఊరు గాని ఒడ్డుగానీ కనిపించడం లేదు. పాపయ్యకు ఏం చెయ్యాలో ఎలా అందర్నీ కాపాడాలో పాలుపోలేదు.


"సామీ బద్రాద్రివాసా! ఏంటయ్యా ఈ ఇప రీతం? నేనేమన్నా తప్పు సేసినానా సామీ. పాపెట్టిమడుసులం. నాను ఓరినన్నా తక్కువగా సూసినానా సామీ! నాను ఆనకు తడిసినా అందర్నీ గూట్లో కూకోమంటినే" అంటూ పరిపరివిధాల ఆక్రోశిస్తూ భగవంతునితో మొర పెట్టుకున్నాడు.

రంగి అందర్నీ గూడులోకి రమ్మని పిలి చింది. కాని ఎవరికీ ధైర్యం చాలటంలేదు. లోపల అడుగు పెట్టడానికి సందేహించారు.

దేముడి దగ్గరకు వెళ్ళాలని అందరికీ ఆశ. కాని దేముడంటే ఎంత భక్తో అంత భయం కూడాను. దేముడు వరాలిస్తాడని అందరికీ తెలుసు. శపిస్తాడని కూడా తెలుసు. దేముడు తనంతట తానుగా పిలుస్తే బాగుండునని ప్రతి వారికీ వుంటుంది.

అందుకే దేముడిలాంటి బ్రహ్మయ్యగారి

## (వి) చిత్ర విజ్ఞానం




ఐక్యరాజ్య సమితి భవనంలోని డాగ్‌హేమర్‌షాల్డ్ లైబ్రరీలో వెయ్యిన్ని ఎనిమిదివందల తొంభైయారు పేజీల పుస్తకం ఒకటుంది. ఈ పుస్తకం పేరు **India at a Glance !**

---

వంక ఆశగా చూశారు అక్కడి వారంతా. ఆయన పిలుపుకోసం రోమాలు నిక్క బొడుచుకు పోతున్నా వినయంగా నిలబడ్డారు. కొంత సేపటికి విసురుగా కొడుతున్న వానకు తట్టుకోలేక కొంచెం కొంచెం లోపలికి, వాళ్ళకు తెలియకుండానే వెళ్ళారు. చోటు చేసుకుని కూచున్నారు.

గాలి జోరుకు తెరచాప చిరిగిపోయింది. గడ విరిగిపోయింది. తాడు తెగిన గాలి పటంలా గమ్యం తెలియని బాటసారిలా నడుస్తోంది పడవ. అందులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని కూర్చున్నారు. పడవ ఏ క్షణాన్నైనా మునిగి పోవచ్చు.

ప్రాణాలమీద అందరికీ తీపి ఉన్నా, ఆశ మాత్రంలేదు. అందరూ ముక్తకంఠంతో ఆర్తులై భగవంతుని ప్రార్థిస్తున్నారు. అందరికీ ఒక్కమాటే గడువు తీరిపోతున్నదని తెలుసు. అది ఏ నిమిషాన్నో, ఏ క్షణాన్నో! పడవలో హాహాకారాలు మిన్నుముట్టుతున్నాయి. ఒకరి మీద ఒకరు కుప్పలు కుప్పలుగా పడుతున్నారు, లేస్తున్నారు. ఇప్పుడు వారిలో తరతమభేదాలు, కులమత భేదాలు లేవు. అందరికీ ఒకటే ఆశ. ఒకటే ప్రార్థన. అందరం కలిసి బ్రతికి బయట పడాలి, అందరం జీవించాలి. ప్రతి ఒక్కరిలో అదే కోరిక. సమిష్టి కోరిక.

బ్రహ్మయ్యగారు భగవద్ధ్యానం చేస్తూ మృత్యువు ఒడిలో, గంగమ్మ కడుపులో చొచ్చుకుపోతే, మోక్షం సంప్రాప్తిస్తుందని కాబోలు భగవంతునిపై మనసు లగ్నంచెయ్యాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. హాహాకారాలు ప్రతి ధ్వనిస్తుంటే ఏకాగ్రత కుదరటం లేదు. అందరూ ఆర్తులైనప్పుడు, అందరూ కలిసి భగవంతుని ధ్యానంచేస్తే, భగవద్ధ్యానంలో భయాన్ని విస్మరించి, హాహాకారాల స్థానంలో భగవన్నామం మారుమ్రోగుతుందనిపించింది బ్రహ్మయగారికి ఆ క్షణంలో. సంఘ బలం ఉంటేగాని మానసిక బలం చేకూరదనిపించింది. అందుకే అందర్నీ కూడ కట్టుకోవాలన్న ఉద్దేశ్యంతో చిరునవ్వుతో అందర్నీ తన దగ్గిరకు పిలుచుకున్నారు.

"కొద్ది క్షణాలలో మృత్యువు ఆలింగనంలో అందరం పరవశిస్తాము. అప్పుడు నీవు, నేను అను భేదంలేదు. రండి నాయనలారా భయ పడకండి, భగవంతుని ప్రార్థించండి" అంటూ వెన్నుతట్టి భయాన్ని తొలగించడానికి ప్రయత్నించారు బ్రహ్మయ్యగారు.

అందరూ భగవంతుని మనసారా ప్రార్థించారు. ఏ పుణ్యాత్ముడి మొర విన్నాడో ఆ భగ

వంతుడు. ఏ పశ్చాత్తప్తుడి హృదయం విదారకమై పొంగిందో! గాలి వాన తిరుగుముఖం పట్టింది. వాతావరణం ప్రశాంతంగా మారింది కొద్ది గంటల కాలంలో.

"మావా! నే గెడేత్తా. నువు కూసింత సేపు కూకో!" అంటూ రంగి పాపయ్య చేతులో గడ తీసుకుంది. పడవ సాగుతోంది.

బయట వాతావరణం ప్రశాంతంగా మారుతున్నకొద్దీ బ్రహ్మయ్యగారి మనసులో అలజడి ఎక్కువ కాసాగింది. అంతవరకూ తనచుట్టూ చేరి అమాయకంగా దేముని ప్రార్థించినవారంతా దూరంగా వెళ్ళి దూరదూరంగా నిలబడ్డారు. పాపయ్య ఒక పక్కగా ఒణుకుతూ చేతులు కట్టుకు నిలబడ్డాడు. బ్రహ్మయ్యగారికి తాను ఒంటరిగాణ్నిగా, వెలివేయబడ్డట్టుగాఅనిపించింది కొంత సేపు.

ఆయన కళ్ళముందు ఏదో అద్భుతమైన కాంతి. ఆ వెలుగు ముందుకు దారిచూపుతోంది. గతం ఒక చీకటిగా, భవితవ్యం నిత్యనూతనంగా, ఆరని వెలుగులా కనిపించింది. అంతే! ఒక్కమాటు నిండుగా ఊపిరిపీల్చుకుని, కాంతులు చిమ్మే తన కళ్ళతో అందరివంకా చూశారు బ్రహ్మయ్యగారు. అందరూ తనని ఇదివరకు చూసినట్లే చూస్తున్నారు భక్తితో. కాని బ్రహ్మయ్యగారి చూపులు పాతవికావు. సరికొత్తవి. అమాంతం ఒక అడుగు ముందుకు వేసి తన వంటిమీద వున్న శాలువా పాపయ్య మీద కప్పారు బ్రహ్మయ్యగారు. ఆయన కళ్ళలో ఏదో తల ప్తి తొంగిచూసింది. అక్కడి వారంతా అదోరకంగాచూశారు. అది భయమో! ఆశ్చర్యమో! వింతో! "తప్పు సాములూ! మమ్మల్ని తాకకండి. పాపమొచ్చుద్ది. పాయచ్చిత్తం చేసుకోవాల్సి వచ్చుద్ది" అన్నట్లుగా, తన మనోభావాల్ని మూగగా కళ్ళతో వ్యక్తం చేశాడు పాపయ్య. భయంతో ఒక రెండు అడుగులు వెనక్కి వేశాడు. ఆ చూపులో ఎన్నెన్ని భావాలు, బ్రహ్మయ్యగారు చదవగలిగారో! పశ్చాత్తాపంతో ఆయన కళ్ళు కిందకు వాలిపోయాయి. బ్రహ్మయ్యగారు మరి రెండడుగులు ముందుకువేసి పాపయ్యని పొదివి పట్టుకుని తనతోపాటు ముందుకు తీసుకెళ్ళారు. ఆయన కళ్ళలో కోటి భావాలు చదివారు అక్కడివారు.

"లేదురా! అజ్ఞానం తొలగిపోయింది. పశ్చాత్తాపమే నాకు ప్రాయశ్చిత్తం. అదే మోక్షం." అంటున్నట్లుగా వున్నాయి ఆయన కళ్ళలోమెదిలే భావనలు. ఆ భావనలకు భాషలేదు.

బ్రహ్మయ్యగారికి తను ఇంతకాలం సాలెపురుగులా గూడు కట్టుకుని కూర్చున్నట్లుగా, ఇప్పుడు ఆ గూడు విచ్ఛిన్నమై పోయినట్లుగా, తన కళ్ళముందు అంతా స్వచ్ఛంగా కనిపించసాగింది.

దూరాన భద్రాద్రి రామన్న కోవెలలో జేగంటలు అవిరామంగా మ్రోగుతూ, భక్తుల్ని ఆహ్వానిస్తున్నాయి. అందరూ ఒక్కమాటుగా దీర్ఘంగా నిట్టూర్చి, చేతులెత్తి నమస్కరించారు ఆ దేవదేవుడికి. □

మీరు చదివారా!

ప్రమోద
పిల్లల మాస పత్రిక

వెల : రూ. 1-25
సం. చందా రూ. 15/-